క్లుప్తంగా

విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

భీమారం: చెట్లకొమ్మలు విద్యుత్ లైన్‌కు అల్లుకుపోవడంతో విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతుందని 'చెట్ల కొమ్మలు తొలగించరూ..' అనే శీర్షికన 'సాక్షి'లో మే 31న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు విద్యుత్ లైన్‌ను అల్లుకున్న చెట్ల కొమ్మలను సిబ్బందితో నరికించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆగచారి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ దామోదర్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర కార్యదర్శులు వెంకట్, శాంతికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవేణు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రామన్న, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

దండేపల్లి: వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పవన్ ఆప్టికల్స్ వారు దండేపల్లి బీజేపీ కార్యాలయంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి కంటి సమస్యలతో బాధపడుతున్న వారు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శస్త్ర చికిత్స అవసరమున్న వారికి ట్రస్టు ద్వారా ఉచితంగా చేయించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరినాయక్, రవిగౌడ్, సురేందర్, ప్రభాకర్, రాకేష్, అశోక్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ స్థల ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామ పంచాయతీ స్థలాన్ని, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొంతమేర ఆక్రమించుకొని గోడ నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు శనివారం దండేపల్లిలో తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. జీపీ స్థలానికి సర్వేయర్ కొలతలు నిర్వహించి, హద్దులు ఏర్పాటు చేసినప్పటికీ, సదరు వ్యక్తి జీపీ స్థలంలోకి కొంతబాగం చొచ్చుకొస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకుని స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. మాజీ సర్పంచ్ పుష్పలత, గ్రామస్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నవగ్రహాల విగ్రహప్రతిష్ఠ



నవగ్రహాల మందిరం వద్ద భక్తుల పూజలు

జన్నారం: మండల కేంద్రంలోని ఈర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర, కంకాలమ్మ ఆలయంలో శనివారం నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రముఖ పూజారి భూమయ్య శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమాలు కాల్చారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



భీమిని: అలంకరణలో హనుమాన్ విగ్రహం



ఒత్కులపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు



జన్నారం: హోమం కాలుస్తున్న భక్తులు



భీమారం: అలంకరణలో హనుమాన్ విగ్రహం

మంచిర్యాలఅర్బన్/భీమారం/దండేపల్లి/భీమిని/జన్నారం/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లిరూరల్(తాండూర్)/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: హనుమాన్ పెద్దజయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయ స్వామికి అభిషేక పూజలు నిర్వహించి, చందనం వేసి తమలపాకులు, మల్లెపూల దండలతో అలంకరించారు. ఆలయాల అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. హనుమంతున్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పలుచోట్ల యజ్ఞం, హోమాలు నిర్వహించారు. అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



మంచిర్యాలఅర్బన్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రామకృష్ణాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



దండేపల్లి: ఆలయంలో భక్తుల పూజలు



వీరాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



బెల్లంపల్లిరూరల్(తాండూర్): పూజలు చేస్తున్న భక్తులు



భీమారం: పూజల్లో పాల్గొన్న ఆలయదాతలు

ఆయాలు లేక అవస్థలు..!



గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా లేక పిల్లలకు అన్నం వడ్డిస్తున్న టీచర్

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్లుగా ఖాళీలు
- భర్తీల గురించి పట్టించుకోని వైనం

దండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల పాత్ర ఎంతో కీలకం. పిల్లలను కేంద్రాలకు తీసుకురావడం, తీసుకొచ్చిన తర్వాత వారికి పోషకాహారంతో పాటు భోజనం వండిపెట్టడం, వారి ఆలన, పాలనా చూసుకోవడంతో పాటు, మళ్లీ ఇంటి వద్ద దింపే వరకు ఆయానే చూసుకుంటుంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి ఆయాలు లేక టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారి విధులతో పాటు, ఆయా విధులు కూడా టీచర్లే నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. దండేపల్లి మండలంలో ఆయాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలు అనేకం ఉన్నాయి. కొన్నింటిలో అయితే పదేళ్లు దాటినా ఆయా పోస్టు భర్తీ చేయడం లేదు. ఆయాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారి భర్తీని గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మండలంలో ఇదీ పరిస్థితి..

దండేపల్లి మండలంలో దండేపల్లి సెక్టార్ పరిధిలో 32, గూడెం సెక్టార్ పరిధిలో 34 మొత్తం 66అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దండేపల్లి సెక్టార్ పరిధిలో ముత్యంపేట, దండేపల్లి-3, వందుర్‌గూడ, చింతపల్లి-1, గూడెం సెక్టార్ పరిధిలోని కన్నెపల్లి-2, గూడెం-1, 3, నంబాల, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట-1, 2, 3, కేంద్రాలతో పాటు, గుడిరేవు-1, కశపల్లి, పాతమామిడిపల్లి-3, దమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాపోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లే ఆయాల విధులు నిర్వహిస్తూ, ఏళ్లుగా నెట్టుకొస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు.

గూడెంలో వింత పరిస్థితి..

మండలంలోని గూడెం ఏజెన్సీ గ్రామం కావడంతో ఇక్కడ ఆయా పోస్టు ఎస్టీలకు రిజర్వేషన్ చేసింది. కానీ గ్రామంలో ఒక్క గిరిజన కుటుంబం కూడా లేకపోవడంతో, ఇక్కడ ఆయా పోస్టుకు ఐదేళ్ల క్రితం నోటిఫికేషన్ వేసినప్పటికీ గిరిజనులు లేకపోవడంతో, పదేళ్లుగా ఆయా పోస్టు భర్తీకి నోచుకోవడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల ఖాళీల గురించి, వాటి భర్తీ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వస్తే భర్తీ చేస్తాం.

– వాణి, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ



తనిఖీల్లో వ్యవసాయ అధికారులు, ఎస్సై రాజశేఖర్



తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీధర్, వ్యవసాయ అధికారి

మందమర్రిరూరల్: మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. షాపుల్లో ఫర్టిలైజర్ స్టాక్ వివరాలు తెలుసుకొని, నిలువ ఉన్నటువంటి విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజేశం మాట్లాడుతూ.. ప్రతి ఫర్టిలైజర్ షాపు డీలర్ ప్రతీరోజు విత్తన స్టాక్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతుల వివరాలు రిజిస్టర్‌లో ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు అమ్మొద్దని, అలాంటి షాపుల నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై మల్లేషం, ఏఈవో తిరుపతి ఉన్నారు.

జైపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ, పోలీసు, రెవెన్యూ సంయుక్తంగా టాస్క్‌ఫోర్సు బృందంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని వ్యవసాయ అధికారి మార్కు గ్లాస్టన్ ఎస్సై శ్రీధర్, ఫెర్టిలైజర్ నిర్వాహకులకు సూచించారు. షాపుల్లో విత్తనాలను తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసేప్పుడు, విత్తనాల తయారు తేదీ, గడువు తేదీ మొదలగు సామగ్రి సరి చూసుకోవాలన్నారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు అందించాలన్నారు. నిషేధిత, నకిలీ, నాసిరక విత్తనాలను రైతులకు అంటగడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'బడిబాట'లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

బెల్లంపల్లిరూరల్(తాండూర్): 'బడిబాట'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండల పరిధిలోని ప్రతీ గ్రామ పంచాయతీలో బడిబాట కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఐకేపీ వీవోలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించుటకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రోజువారీగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిష్టంపేట పాఠశాల హెచ్‌ఎం మాసాడి శ్రీరాములు, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ బి రాహుల్



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ సూచించారు. నస్పూర్, తీగల్‌పహాడ్, సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, మూత్ర శాలలు, విద్యుదీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంలోపు పనులు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, మున్సిపల్ కమిషనర్ సతీశ్, ప్రధానోపాధ్యాయుడు రామన్న తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు పాదయాత్ర చేసిన వినీత్‌కు స్వాగతం



స్వాగతం పలుకుతున్న స్థానికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాలకు చెందిన పానం వినీత్ అయోధ్య పాదయాత్ర పూర్తిచేసి మంచిర్యాలకు తిరిగి వచ్చిన సందర్భంగా మంచిర్యాల వాసులు స్వాగతం పలికారు. హనుమాన్ మాలాధారణ స్వీకరించిన వినీత్ ఏప్రిల్ 22వ తేదీన మంచిర్యాల ఎల్ఐసీ కాలనీలోని పంచముఖ హనుమాన్ ఆలయం నుంచి అయోధ్యకు పాదయాత్ర ప్రారంభించాడు. ఒంటరిగా పాదయాత్రగా వెళ్లిన వినీత్ 38రోజుల పాటు పాదయాత్ర చేసి అయోధ్యలోని రామ్‌లల్లాను కనుల పండవగా దర్శనం చేసుకున్నాడు. దర్శనం అనంతరం అయోధ్య నుంచి తిరుగు ప్రయాణమైన వినీత్ శుక్రవారం మంచిర్యాలకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వినీత్‌ను మంచిర్యాల బొజ్జ యూత్ సభ్యులతో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) సభ్యుడు కొండ చంద్రశేఖర్‌లు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తండ్రి, కూతురు



అవార్డ్స్‌తో తండ్రి శ్రీనివాస్, కూతురు వెన్నెల

జైపూర్: మండలంలోని ఇందారంకు చెందిన తండ్రి, కూతురు చిప్పకుర్తి శ్రీనివాస్, వెన్నెల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి సభలో శ్రీనివాస్, వెన్నెల పాల్గొన్నారు. చిత్రకళాకారులు అయిన తండ్రి, కూతురు ప్రదర్శన ఆకట్టుకుంది. దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానాన్ని సంపాదించుకున్నారు. కళా నిలయం వ్యవస్థాపకులు సురేందర్ వారిని సన్మానించి జ్ఞాపికలు అందించారు.

గేదె కళేబరం తొలగించండి..!

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయరహదారిపై పోలంపల్లి బస్టాప్ సమీపంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన గేదె కళేబరాన్ని ఇప్పటికీ తొలగించలేదు. దుర్వాసన వెదజల్లక ముందే, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని వెంటనే గేదె కళేబరాన్ని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అమరవీరులకు నివాళి

మందమర్రిరూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. పాత బస్టాండ్ వద్ద గల శివాజీ పాఠశాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

టేకు చెట్టు నరికివేత



జన్నారం: జన్నారం అటవీ డివిజన్ జన్నారం రేంజ్ పైడిపెల్లి బీట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విలువైన టేకు చెట్టును రంపంతో కోసి పడేశారు. శుక్రవారం రాత్రి రోడ్డు సమీపంలోనే రంపంతో చెట్టును కోసి, పడిన శబ్దం రాకుండా తాళ్లతో కట్టేశారు. చెట్టుకొమ్మలు కరెంట్ వైర్లపై పడి మంటలు రాగా స్మగ్లర్లు పరారైనట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం కరెంట్ సిబ్బంది లైన్ తనిఖీ చేస్తుండగా ఈ విషయం బయటకు వచ్చింది. మంటలు లేవడంతో కోసిన రంపం కూడా అక్కడే వదిలి వెళ్లారు. ఉదయం విషయం తెలుసుకున్న అటవీ అధికారులు నిందితుల కోసం విచారణ చేపట్టారు. చెట్టు నరికివేతలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నట్లు, ఇందులో ఒకరిని గుర్తించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా, స్పందించలేదు.

సంక్షిప్త వార్తలు

బాధితురాలికి అండగా..

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌కు చెందిన శనిగారపు లక్ష్మికి గల పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో ఆమెకు స్థానిక రజక సంఘం నాయకులు అండగా నిలిచారు. వంట పాత్రలు, 50 కిలోల బియ్యం, కిరాణ సామన్లు, కూరగాయలను శనివారం అందించారు.

పులిహోర, మజ్జిగ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వీరహనుమాన్ సేన ఆధ్వర్యంలో శనివారం పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. వీరహనుమాన్ సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్, సభ్యులు ఈశ్వర్, వంశీ, వినోద్, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి వందశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్ సూచించారు. 'బడిబాట'లో భాగంగా గ్రామైఖ్య సంఘ అధ్యక్షురాళ్లకు, పాఠశాలల చైర్మన్లకు అవగాహన కల్పించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. 19వ తేదీ వరకు జరిగే బడిబాటలో పాల్గొనాలని సూచించారు. ఏపీవో రమేశ్, ఐకేపీ ఏపీఎం బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాంలు పంపిణీ

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం విద్యార్థుల యూనిఫాంలను ఎంపీడీవో రాజేశ్వర్ అందజేశారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ సిద్ధం'

మంచిర్యాలఅర్బన్: తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సిద్ధంగా ఉందని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో చంద్రబాబునాయుడు నివాసంలో తెలంగాణ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. తెలంగాణ టీడీపీ బలోపేతానికి కార్యకర్తలకు అన్నివిధాలా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధంగా ఉంచాలని సూచించినట్లు పేర్కొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బెల్లంపల్లిరూరల్(తాండూర్): గ్రామీణ యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి తాండూర్ పోలీస్ సర్కిల్ పరిధిలోని అంకుశం గ్రామంలో సమ్మర్ వాలీబాల్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులకు శిక్షణ పత్రాలు అందజేశారు.